పారిపోయిన సైంటిస్టులు

అజీజ్

"డియర్ రాజారెడ్డీ! మద్రాసు నించి మిమ్మల్ని ఉన్న పళంగా దేనికి పిలిపించేమో బహుశా మీరు ఊహించి ఉంటారు. అత్యంత రహస్యమైన, ప్రమాదకరమైన ఒక మిషన్ మీద మిమ్మల్ని పంపబోతున్నాం." అంటూ బల్ల సొరుగు లాగి, అందులోంచి రెండు కేబినెట్ సైజు ఫోటోలు తీసి రాజారెడ్డి ముంగుకి చాచేడు స్పెషల్ బ్రాంచ్ డైరెక్టర్ పినాక్ పాణి.

ఫోటోలు అందుకుని పరీక్షగా చూసేడు రాజారెడ్డి. మొదటి ఫోటోలో ఉన్న వ్యక్తికి నలభై ఏళ్ళుంటాయి. బట్ట తల, వెడల్పాటి మొహం, క్లీన్ షేవ్. మత్తుగా చూసే కళ్ళు, ఫోటో వెనక అతని పేరు రాసి ఉంది.

ప్రొఫెసర్ అగర్వాల్.

(బయోలజిస్ట్)

రెండో ఫోటోలో ఉన్న వ్యక్తికి ఏభై ఏళ్ళుంటాయి. బక్క పల్చని మొహం. కోటేరు ముక్కు. అస్తవ్యస్తంగా పెరిగిన జుత్తు, గడ్డం, మీసాలు. ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నట్టుండే లోతైన కళ్ళు, ఫోటో తిప్పి అతని పేరు చూసేడు రాజారెడ్డి.

ప్రొఫెసర్ బీరేంద్రనాథ్ ముఖర్జీ.

(కెమిస్ట్)

"వీళ్ళిద్దరూ ప్రఖ్యాత సైంటిస్టులు. పదేళ్ళ క్రితం మన ప్రభుత్వ లేబరేటరీలో ఒక ప్రత్యేకమైన ప్రాజెక్ట్ మీద రిసెర్చ్ జేసేవాళ్ళు.

ఒకరోజు హఠాత్తుగా, ఆ ప్రాజెక్ట్ తాలూకు రహస్య పత్రాలతో ఇద్దరూ మాయమయ్యారు. మన ఏజెంట్లు ఎంత గాలించినా వీళ్ళ జాడ దొరకలేదు.

కాని, ఈమధ్యే మాకు తెలిసింది వీళ్ళ ఆచూకీ. ఇప్పుడు వీళ్ళిద్దరూ స్వపరిపాలితమైన ఒక స్వతంత్ర దీవిలో, అక్కడి పౌరసత్వం సంపాదించి రహస్యంగా ఉంటున్నారు.

ఆ దీవి పేరు 'కర్కాయీ' ఆ ద్వీపం హిందూమహా సముద్రంలో (ఇటు జావా దీవులకీ, అటు న్యూజిలాండ్ కీ మధ్య ఉంది. దాదాపు వందమైళ్ళ పొడవూ, డెభై మైళ్ళ వెడల్పూ గల ఆ దీవి జనాభా సంఖ్య పది లక్షలు.

ఒకప్పుడు దానిపై పోర్చుగీస్ అధికారం ఉండేది. పదేళ్ళ క్రితం ఆ దీవికి స్వాతంత్ర్యం లభించింది. కాని, ప్రజాప్రభుత్వం మూడేళ్ళ మాత్రమే సాగింది. ఇప్పు

దక్షిణ మిలటరీ ప్రభుత్వం అధికారంలో ఉంది. జనరల్ ఫెర్నాండెజ్ దానికి నియంత.

ఆ దీవి రాజధాని పేరు 'కాలింగ్.' ఆ నగరాన్ని ఆనుకునే ఓడరేవు ఉంది. కాలింగ్‌కు ఇరవై మైళ్ళ దూరంలో 'వాస్కా' అనే సరస్సు ఉంది. ఆ సరస్సు అవలి ఒడ్డున ఓ అడవి ప్రారంభమౌతుంది. ఆ అడవిలోనే ఎంతో కట్టుదిట్టంగా కట్టిన ఓ బిల్డింగ్ ఉంది.

ఆ బిల్డింగే ఇప్పుడు ప్రపంచ ప్రజలందరికీ ప్రమాదకరంగా తయారయింది. కారణం, ఈ యిద్దరు సైంటిస్టులూ, ఆ బిల్డింగ్‌లోనే అత్యంత భయంకరమైన ఒక గ్యాస్ తయారు చేస్తున్నారు. ఆ గ్యాస్ పేరు ఎఫ్ నైన్!

ఆ గ్యాస్ వల్ల మనుషులు మరణించరు. మూర్ఛపోరు. కాని, అంతకంటే భయంకరమైన పరిణామాలకి గురి అవుతారు. ఆ గ్యాస్ ప్రయోగించిన పదిహేను నిమిషాల లోపున మనిషి మెదడులోని జ్ఞాపకశక్తి పూర్తిగా తుడిచి వెయ్యబడుతుంది. తను ఎవ్వరో, తన పేరేమిటో, తనవాళ్ళెవ్వరో ఏమీ తెలీకుండా మనిషి అప్పుడే పుట్టిన పసివాడిలా మారిపోతాడు.

ఆ గ్యాస్‌ని ఒక సైన్యం మీదగానీ, నగరం మీద గానీ, వదిలితే గంట లోపల పూర్తి సైన్యం, జ్ఞాపకశక్తిని కోల్పోయి పిచ్చిదై పోతుంది. అందుకే, జనరల్ ఫెర్నాండెజ్ ఆ గ్యాస్ ద్వారా పూర్తి ఏషియాను కబళించాలనే కలలు కంటున్నాడు. ఒకవిధంగా ఆలోచిస్తే ఆ గ్యాస్ ఆటంబాంబు, హైడ్రోజన్ బాంబుల కంటే అతి ప్రమాదకరమైనది.

మా అంచనా ప్రకారం మరో నాలుగు నెలల్లో అది

పూర్తిగా తయారై, జనరల్ ఫెర్నాండెజ్ వాడుకోడానికి సిద్ధం ఉంటుంది.

అది జరక్కముందే ఆ లేబరేటరీని ధ్వంసం చెయ్యాలి. దేశద్రోహులైన ఆ ఇద్దరు సైంటిస్టులనీ సజీవంగా బంధించి ఇక్కడికి తీసుకు రావాలి. దీనికి ఎంత ఖర్చైనా సరే వెనుకాడ వద్దు. మీకు సహాయంగా ఎంతమంది కావలసినా మీ వెంట తీసికెళ్ళ వచ్చు.

అంతే కాదు, ఆ దీవికి ముప్ఫై మైళ్ళ దూరంలో సముద్రం మధ్య, మన నౌకా దళానికి చెందిన ఓ నౌక రెడీగా ఉంటుంది. మీకెప్పుడే సహాయం కావాలసినా అందించడానికి" అన్నాడు పినాక్ పాణి.

అంతావిన్న రాజారెడ్డి వెంటనే పలకలేదు. సిగరెట్ అంటించి కాసేపు తీవ్రంగా ఆలోచించి తలెత్తేడు.

"ఆల్ రైట్! నా వెంట ముగ్గుర్ని తీసికెళ్తాను. నా అసిస్టెంట్ డేవిడ్, లేడీ ఇన్వెస్టిగేటర్ షీలా, మీ శాఖలో అనుభవజ్ఞుడైన ఎలక్ట్రానిక్ ఇంజినీర్ పృథ్వీ రాజ్ మా వెంట ఉంటాడు."

పినాక్ పాణి తలూపేడు. "మీ అంచనా సరైనదే! మీకు ఎవ్వరు కావలసినా, ఏ వస్తువు కావలసినా, ఎంత డబ్బు అవసరమైనా, క్షణాలమీద ఏర్పాటు చెయ్యగలను."

రాజారెడ్డి కాస్త ముందుకి వంగి, తన ప్లాన్ ఏమిటో పినాక్ పాణికి వివరించ సాగేడు.

2

అది కరేబియా ద్వీపరాజధాని కాలింగ్ లోని ఖరీదైన హోటల్ 'బర్ మోడా'.

ఆ హోటల్లో దిగేవాళ్ళందరూ ధనవంతులైన విదేశీ యాత్రీకులే. సరిగ్గా ఉదయం తొమ్మిది గంటలకి ఓటాక్సీ వచ్చి ఆహోటల్ ముందాగింది. అందులోంచి దిగిన ఓపాతికేళ్ళ యువతి, హాండ్ బాగ్ ఊపుకుంటూ ఒయ్యారంగా అడుగులు వేస్తూ, హోటల్లో ప్రవేశించగానే, అక్కడ కూర్చున్న వాళ్ళందరి దృష్టి ఆమె వైపు మళ్ళింది.

భుజాలవరకూ కత్తిరించుకున్న జుత్తు. పెదాలకి లిప్ స్టిక్ ఎర్రని గౌన్ కింద, తెల్లగా బలిసిన తొడలు. కళ్ళకి కూలింగ్ గ్లాసెస్. ఆమె అడుగులకి లయగా కదులుతున్న పిరుదులూ, బంతులూ అక్కడ కూర్చున్న వాళ్ళందర్నీ రెప్ప వెయ్యకుండా జేస్తున్నాయి.

హంసలా నడుస్తూ తన వైపు వస్తున్న ఆ యువతిని కన్నార్పకుండా చూస్తున్నాడు కౌంటర్ క్లర్క్.

ఆమె తిన్నగా అతని దగ్గరి కెళ్ళి "హల్లో! బహుశా ఈ పాటికి నా రూం రిజర్వేషన్ జరిగి ఉంటుందను కుంటాను." అంది అచ్చు యూరోపియన్ స్టయిల్ ఇంగ్లీషులో.

అతను ఉలిక్కిపడి—"మీ పేరు?" అన్నాడు.

"మిస్ లారెన్స్!"

"ఓ, ఎస్. ఎస్!" అతను గబగబ రిజిస్టర్ తిరగేసి ఆమె ముందుకుతోసి "వీరి సామాను థర్డ్ ఫ్లోర్‌లో, రూం నెంబర్ పదహారులో పెట్టు" అన్నాడు హోటల్ బాయ్‌తో.

ఆ యువతి రిజిస్టర్‌లో సంతకం పెట్టి, ఎడ్వాన్స్ పేజేసి నడుం ఊపుకుంటూ లిఫ్ట్ వైపు నడిచింది. అక్కడ

కూర్చున్న వాళ్ళందరి కళ్ళల్లోను ఆకలి నాట్యంజెయ్యడం కూలింగ్ గ్లాసెస్‌లోంచి గమనించి, లోలోన నవ్వుకుంది.

ఆమె, మారువేషంలో ఉన్న లేడీ ఇన్వెస్టిగేటర్ షీలా!

* * *

సరిగ్గా పది గంటలకి హోటల్ ముందు ఓ ఇంపాలా టాక్సీ వచ్చి ఆగింది.

ఫ్రంట్ సీట్లోంచి ఫుల్ సూటులో ఉన్న ఓ వ్యక్తి దిగి, బాక్ డోర్ తెరిచి పట్టుకున్నాడు.

అందులోంచి అరబ్బు దుస్తుల్లో ఉన్న ఓ వ్యక్తి దిగేడు పిల్లి గడ్డం, అందంగా కట్ చేసిన మీసాలు. కళ్ళకి నల్లని అద్దాలు. తలమీద తెల్లని బట్ట. దాని చుట్టూ ఉన్న నల్లని రోప్స్ మధ్య సరిగ్గా పాలభాగం దగ్గర ధగ ధగ మెరుస్తున్న ఖరీదైన డైమండ్. నడుం దగ్గర బంగారు పిడి గల చిన్న కైజారు.

ముందు సీటులో ఉన్న వ్యక్తి గబగబ హోటల్లోకి ప్రవేశించేడు. అతని వెనకే అడుగులో అడుగు వేసుకుంటూ ఆ అరబ్బు దుస్తుల్లో ఉన్నతను లోనికి వచ్చి తలుపు దగ్గర ఆగిపోయేడు.

సూటులో ఉన్న వ్యక్తి కౌంటర్ దగ్గరకెళ్ళి "కువైట్ నించి మేమిచ్చిన టెలిగ్రాం బహుశా మీకంది ఉంటుంది. ప్రిన్స్ ఖాసిమ్ ఉలేమాన్ గారి గది సిద్ధం చేశారా?" అడిగేడు తగ్గు స్వరంతో.

కౌంటర్ క్లర్క్ తల త్రిప్పి ప్రిన్స్‌నీ, అతని పాల భాగం మీద మెరుస్తున్న డైమండ్‌నీ, నడుంకి వేలాడుతున్న కైజారునీ చూడగానే చటుక్కున లేచి నిల్చుని-

"మీ టెలిగ్రాం అందగానే, మా హోటల్లో ప్రముఖుల కోసం ఏర్పాటుచేసే గది రిజర్వ్ చేశాం. ఉండండి, మేనేజర్‌గార్ని పిల్చుకొస్తాను" అంటూ హడావుడిగా లోపల కెళ్ళేడు.

రెండు నిమిషాల తర్వాత హోటల్ మేనేజర్ పరిగెత్తుకు వచ్చి అరబ్బు పద్ధతిలో వంగి వంగి సలాములు చేస్తూ "రాజవంశీయులకు సుస్వాగతం!" అన్నాడు.

ప్రిన్స్ ఖాసిమ్ ఉలేమాన్ అరబ్బు భాషలో తీక్షణంగా ఏదో అని తలూపేడు.

ప్రిన్స్ వెంట వచ్చిన వ్యక్తి మేనేజర్ని సమీపించి, తగ్గు స్వరంతో—"ఈ రోజు ప్రిన్స్ కాస్త కోపంలో ఉన్నారు. మేము కువైట్ నించి బైలుదేరిన జెట్ విమానం కొలంబో ఏర్‌పోర్ట్‌లో ట్రబుల్ ఇవ్వడంతో, విధిలేక ఇతర ప్రయాణీకులతో కూర్చుని అమెరికన్ విమానంలో రావలసివచ్చింది. అప్పటినించే ప్రిన్స్ మూడ్ కాస్త చెడిపోయింది.

దానికి తోడు, ఇక్కడి కస్టమ్స్ ఆఫీసర్లు మంచీ మర్యాదా లేకుండా ప్రిన్స్ సామాను తనిఖీ చెయ్యాలని పట్టు బట్టడంతో ఆయన కోపం తారాస్థాయి నందుకుంది. పరాయి దేశం గనక బ్రతికిపోయేరు. అదే మాదేశమై ఉంటే ఈ పాటికి వాళ్ళ తలలు ఎగిరి పోయుండేవి.

ఆయనపట్ల ఏమాత్రం అమర్యాద జరిగినా సహించరు. మీ హోటల్లో అటువంటి సంఘటనేదీ జరగదని ఆశిస్తున్నాను" అన్నాడు.

"ఎంతమాట, ఎంతమాట అలా జరగనిస్తామా? ఇక్కడ వారి అడుగులకి మడుగులొత్తబడతాయి. మీరీ

విషయంలో నిశ్చింతగా ఉండండి," అన్నాడు హోటల్ మేనేజర్ వినయం ఒలకబోస్తూ.

"కొద్దిసేపట్లో ఏర్‌పోర్ట్‌నించి సామాన్లతో నిండిన మూడు టాక్సీలు వస్తాయి. వానిని జాగ్రత్తగా ప్రిన్స్ గదికి చేరవెయ్యండి."

"అలాగే! ఆ పనంతా మాకు వదిలెయ్యండి," అంటూ మేనేజర్ కౌంటర్ మీద రిజిస్టర్ అందుకుని—"క్షమించండి. ఇక్కడి వెధపరూల్సు కొన్ని ఉన్నాయి. అందుకనీ..." అంటూ నీళ్ళు నములుతూ రిజిస్టర్ని సూటువాలా ముందుకి చాపేడు.

అతనా రిజిష్టర్ అందుకుని, ఇద్దరి పేర్లూ నింపేడు.

ఖాసిమ్ ఉలేమాన్-ప్రిన్స్ ఆఫ్ కువైట్.

ఖుద్రతుల్లా సూడానీ- ప్రిన్స్ సెక్రటరీ.

మేనేజర్ రిజిస్టర్ అందుకునీ-"దీనిమీద గౌరవనీయులైన ప్రిన్స్ సంతకం కూడా చేశారంటే, మా మీద దయ చూపిన వారౌతారు," అన్నాడు తడబడుతూ.

సూటువాలా ప్రిన్స్ వైపు తిరిగి అరబ్బీ భాషలో ఏదో అన్నాడు. ప్రిన్స్ తీక్షణంగా ఏదో అని, తన చేతివేలికి ఉన్న ఓ ఉంగరం తీసిచ్చేడు. అప్పుడు చూసేడు మేనేజర్, ప్రిన్స్ రెండు చేతివేళ్ళకీ ఉన్న ధగ ధగ మెరిసే వజ్రపుటుంగరాలని.

అతను తీసిచ్చిన ఉంగరం మీద, అరబ్బు భాషలో ఏదో చెక్కి ఉంది. సూటువాలా, జేబులోంచి స్టాంప్ పేడ్ తీసి ఉంగరాన్ని ముద్రగా రిజిస్టర్‌లో సంతకం ఉండవలసిన చోట వేసేడు.

ఇంతలో మూడు టాక్సీలు వచ్చి హోటల్ ముందు

ఆగేయి. వాటిలో సూట్ కేస్ లూ, ఏర్ బ్యాగ్ లూ ఇతర సామాన్లూ నిండి ఉన్నాయి. మేనేజర్ వెంటనే నౌఖరు బలగానికి వాటిని జాగ్రత్తగా పైకి తీసికెళ్ళమని ఆజ్ఞా పించి, ప్రిన్స్ కి దారి చూపిస్తూ లిఫ్ట్ వైపు తీసికెళ్ళాడు.

ప్రిన్స్ వేషంలో ఉన్నది డేవిడ్!

అతని సెక్రటరీ రూపంలో ఉన్న వ్యక్తి, ఎలక్ట్రానిక్ ఇంజనీర్ పృథ్వీరాజ్.

* * *

సరిగ్గా పదకొండు గంటలకి ఓ టాక్సీ వచ్చి హోటల్ ముందు ఆగింది. అందులోంచి ఖరీదైన ఫుల్ సూటులో దిగిన వ్యక్తి, డ్రైవర్ కి మీటర్ బిల్ పేజేసి, బూట్సు టక టక లాడిస్తూ హోటల్లో ప్రవేశించేడు.

తిన్నగా కౌంటర్ దగ్గరికెళ్ళి– "వారం రోజుల క్రితం జకార్తా నుంచి ఈ హోటల్లో ఓ రూం రిజర్వ్ జెయ్యమని టెలిగ్రాం ఇచ్చేను. అందిందా?" అడిగాడు క్లర్క్ తో.

క్లర్క్ అతన్ని పరీక్షగా చూసి– "మీ పేరు?" అన్నాడు.

"ఆర్నో! ఫ్రం ఇండోనేషియా!"

"అందింది మిస్టర్ ఆర్నో! గ్లాడ్ టు సీయూ!" అన్నాడు క్లర్క్ అతనికి షేక్ హేండ్ ఇస్తూ.

అతనే రాజారెడ్డి!

అంతకిముందు అతన్ని చూసిన వాళ్ళెవ్వరూ ఇప్పుడు గుర్తించడం కష్టం. ఎంతో అనుభవ పూర్వకంగా అతని కళ్ళు మామూలు కంటే కాస్త చిన్నవి జెయ్యబడ్డాయి. కనుబొమలు ఇంకా స్త దట్టంగా అతికించబడ్డాయి. ఎవ్వరైనా కళ్ళెత్తి అతన్ని చూస్తే, నిజంగా ఇండోనీషియన్ అన్న భ్రాంతి కలుగుతుంది.

కౌంటర్ క్లర్క్ రిజిస్టర్ తెరిచి అతని ముందుకి తోశాడు. రాజారెడ్డి అందులో తన నకిలీ పేరు రాసి, అడ్రస్ కాలమ్‌లో ఇండోనేషియాలోని పేరుపొందిన ఓ కెమికల్ సంస్థ పేరు రాసేడు. ఆ సంస్థ తయారుజేసే కెమికల్స్ విదేశాలకి ఎగుమతి జెయ్యబడతాయి.

క్లర్క్ బోయ్‌ని పిలిచి_ "వీరి సామాను సెకెండ్ ఫ్లోర్‌లోని 7వ నెంబరు గదిలో పెట్టు" అన్నాడు.

3

భారత స్పెషల్ బ్రాంచ్ డైరెక్టర్ పినాక్‌పాణి ఇచ్చిన సమాచారం ప్రకారం, ఆ హోటల్‌కి ఫర్లాంగు దూరంలో పంట తెగుళ్ళని నివారించడానికి మందులు తయారుజేసే ఓ ఫర్మ్ ఉంది. ప్రొఫెసర్ అగర్వాల్ దానికి డైరెక్టర్!

మధ్యాహ్నం సరిగ్గా రెండు గంటలకి ఓ టాక్సీలో తిన్నగా మినిస్ట్రి ఆఫ్ కామర్స్ ఆఫీస్ జేరుకున్నాడు రాజారెడ్డి. విజిటింగ్ కార్డు పంపిన కొద్ది నిమిషాలకే పిలుపు వచ్చింది లోపలినించి.

మినిస్ట్రి ఆఫ్ కామర్స్ సెక్రటరీ అతన్ని సాదరంగా లోనికి ఆహ్వానించి కూర్చోబెట్టేడు.

"వారం రోజుల క్రితం నేను రాసిన ఉత్తరం బహుశా మీకు ముట్టి ఉంటుంది. వివిధ దేశాల్లో ఉన్న నా ఫ్యాక్టరీలు రకరకాల కెమికల్స్‌ని తయారుజేసి ఎగుమతి జేస్తాయి.

ప్రస్తుతం ఈ నగర శివార్లలో ఉన్న బంజరు భూమి, మాకు కావలసిన ఒక రకం వేరుని ఉత్పత్తి జెయ్యడానికి

ఎంతో అనుకూలంగా ఉందని తెలిసింది. ఆ వేరుతో మేము ఓ ప్రత్యేకమైన కెమికల్ లిక్విడ్ తయారు చెయ్యాలి. దానితో ఒక రకం పంట తెగుళ్ళని నివారించ వచ్చు.

ఈ విషయంలో మీ ప్రభుత్వం నాతో సహకరిస్తా నంటే నేను దీనిపై రెండు కోట్లు పెట్టుబడి పెట్టగలను.'' అన్నాడు రాజారెడ్డి ఎంతో అనుభవం ఉన్న బిజినెస్ మాగ్నెట్ లా.

సెక్రెటరీ నవ్వి- ''మా ప్రభుత్వం ఎప్పుడూ విదేశ వర్తకులకి అన్నివిధాలా సహకరిస్తూనే ఉంది. ఎటొచ్చీ వారి లాభాల్లో మాకు కొంత చెల్లించవలసి ఉంటుంది.'' అన్నాడు.

రాజారెడ్డి తలూపి, ''నాకు తెలుసు. మీ ప్రభుత్వ బిజినెస్ ప్రిన్స్ పుల్స్ చదివేను. మీ షరతులన్నీ అంగీక రిస్తున్నాను. లాభంలో పది శాతం మాత్రం నా దేశానికి తీసికెళ్తాను. ఏమంటారు?'' అన్నాడు.

సెక్రెటరీ తలూపి- ''అలా ఐతే మాకేమీ అభ్యం తరం లేదు!'' అన్నాడు ఆనందంగా.

''థాంక్యూ! మన ఒప్పందం మీద సంతకాలు జేసే ముందు నేనొకసారి ఆ భూమిని పరిశీలించాలనుకుంటు న్నాను. దయచేసి ఓ హెలికాప్టర్ ఏర్పాటు జెయ్య గలరా?''

''హెలికాప్టరా?'' అంటూ సెక్రెటరీ తల గోక్కొని- ''దానికోసం చాల రిస్క్ తీసుకోవలసి ఉంటుంది. ఆఁ! నాకు తెలిసిన ఓ వ్యక్తి ఉన్నాడు. అతని దగ్గర స్వంత హెలికాప్టర్ ఉంది. కానీ...'' అంటూ నసిగేడు సెక్రెటరీ.

రాజారెడ్డి వెంటనే జేబులోంచి వంద వంద డాలర్ల రెండు కట్టలు తీసి_ "డబ్బుకోసం వెనుకాడ వద్దు. ఎంత ఖర్చైనా సరే ఏర్పాటు జేయించండి. ప్లీజ్!" అన్నాడు వాటిని బల్లమీద పెడుతూ.

ఐదువేల డాలర్లు చూడగానే సెక్రెటరీ కళ్ళు తళతళ మెరిసేయి. ఆ హెలికాప్టర్ ఓనర్ రోజుకి ఐదువందల డాలర్లు బాడుగ తీసుకోవచ్చు. మిగతా నాలుగున్నర వేలు తనవే!

"ఆల్ రైట్, ప్రయత్నిస్తాను. పని జరిగితే మీ గదికి ఫోన్ జేసి చెబుతాను." అన్నాడు సెక్రెటరీ నోట్లకట్టలు అందుకుంటూ.

"మరొక్క విషయం. నాకు టాక్సీల్లో తిరిగే అలవాటు లేదు. ఏదైనా కారు అద్దెకు దొరికే అవకాశం ఉందా?"

సెక్రెటరీ తలూపి_ "ఇక్కణ్నించి తిన్నగా సిటీ గ్యారేజ్ సర్వీస్‌కు వెళ్ళి, నా పేరు చెప్పండి. ఈలోగా నేను వాళ్ళకి ఫోన్ జేస్తాను. మీ కిష్టమైన కారు ఇస్తారు." అన్నాడు.

అతనికి థాంక్స్ చెప్పి లేచాడు రాజారెడ్డి.

బైటికి రాగానే ఓ పబ్లిక్ టెలిఫోన్ బూత్‌లో దూరి, టెలిఫోన్ డైరెక్టరీ వెదికి, ప్రొఫెసర్ అగర్వాల్ నడుపుతున్న కెమికల్ ఫర్మ్ ఆఫీస్‌కి ఫోన్ జేసేడు.

"ఎస్! కెమికో ఆఫీస్." అవతలినించి వినిపించింది.

"ప్రొఫెసర్ అగర్వాల్‌తో మాట్లాడాలి." అన్నాడు రాజారెడ్డి.

"సారీ సర్. వారిప్పుడు ఫ్యాక్టరీలో ఉన్నారు. బహుశా సాయంత్రం తిరిగి రావచ్చు. ఆయన వారంలో

నాలుగు రోజులు ఫ్యాక్టరీలో పనిజేసి, మూడు రోజులు సిటీలో గడుపుతారు.'' చెప్పేడు క్లర్కు.

''ఆయన్ని ఎక్కడ కలుసుకోడానికి వీలుంటుంది?''

''హోటల్ బరోడాలో వారికి ఓ పర్మినెంట్ గది ఉంది. వారంలో మూడు రోజులు ఆయన ఆ గదిలోనే గడుపుతారు. దయచేసి మీరెవ్వరో చెబితే, ఆయన వచ్చేక చెప్పగలను.''

''సరే! ఆయన్ని హోటల్లోనే కలుసుకుంటాను. సాయంత్రం ఆయన వస్తే చెప్పండి డాక్టర్ ఘోష్ ఫోన్ జేశాడని!'' అంటూ రిసీవర్ క్రెడిల్ జేసేడు రాజారెడ్డి.

పదేళ్ళ క్రితం ఆ సైంటిస్టులిద్దరూ భారత దేశంలోని ప్రభుత్వ లేబొరేటరీలో రీసెర్చి జేసేటప్పుడు, డాక్టర్ ఘోష్ ఆ లేబొరేటరీకి డైరెక్టర్‌గా ఉండేవాడు.

ఇన్నేళ్ళ తరువాత ఇప్పుడు హఠాత్తుగా ఇక్కడ డాక్టర్ ఘోష్ పేరు వినగానే ప్రొఫెసర్ అగర్వాల్‌లో భయం మొలకెత్తుతుంది. అందుకే రాజారెడ్డి ఆ పేరు చెప్పేడు.

బూత్‌లోంచి బైటికి వచ్చి, టాక్సీ ఎక్కి తిన్నగా సిటీగ్యారేజ్ సర్వీస్‌కు బైలుదేరాడు. అక్కడ ఓ షెవర్లెట్ కారు అద్దెకి తీసుకుని హోటల్ జేరుకున్నాడు. కారు పార్కింగ్‌లో ఆపి హోటల్లోకి నడిచేడు.

తిన్నగా తన గదిలోకెళ్ళి, లోపలినించి తలుపు మూసుకున్నాడు. గబగబ బాత్‌రూంలోకి ప్రవేశించి, జేబులోంచి సిగిరెట్ లైటర్ తీసేడు.

అది రెండువిధాల పనిజేసే ట్రాన్స్‌మిటర్. ఎంతో సూక్ష్మమైన స్క్రూలతో, పరికరాలతో తయారుజెయ్య

6

ుడింది. కేవలం మూడువందల గజాల వ్యాసార్ధంలో పని జేస్తుంది. అందులో ఒక ప్రత్యేకమైన ఫ్రీక్వెన్సీ ఏర్పాటు ఉంది గనక, ఇతర ట్రాన్స్‌మిటర్లేవీ దాని తరంగాలని పట్టుకోలేవు.

ఏరియల్ బైటికి లాగి, బటన్ వత్తి– "హలో!" అన్నాడు రాజారెడ్డి.

అవతలినించి డేవిడ్ కంఠం వినిపించగానే, చక చక చెప్పసాగేడు.

"ఈ రోజు సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో ప్రొఫెసర్ అగర్వాల్ ఇక్కడికి వస్తున్నాడు. ఈ హోటల్లో అతనికో పర్మనెంట్ గది ఉంది. వారంలో మూడురోజులు ఆ గదిలోనే గడుపుతాడుట.

అతను వచ్చేలోగా మన ఎలక్ట్రానిక్ ఇంజనీర్ పృధ్వీరాజ్‌కు చెప్పి, ఆ గదిలో మైక్రోఫోన్ ఏర్పాటు జేయించు. దాని ద్వారా మీ గదిలో ఉండి, ప్రొఫెసర్ గదిలో జరిగే సంభాషణంతా రికార్డ్ జేస్తుండాలి. అంతే కాదు, అతని కార్లో రహస్యంగా ఓ టైంబాంబ్ కూడా ఏర్పాటు జేయించాలి.

ఈ రాత్రి సరిగ్గా తొమ్మిదిన్నరకి నేనూ, పృధ్వీరాజ్ కెమికో ఆఫీస్‌లో దొంగచాటుగా ప్రవేశించే ప్రోగ్రాం సెట్ జేసేను. అర్థమైందా?"

"ఓ. కే. సర్!" అన్నాడు డేవిడ్ అవతలినించి.

రాజారెడ్డి ట్రాన్సిమిటర్ ఆఫ్ జేసి, ఏరియల్ దించి, జేబులో వేసుకున్నాడు.

4

సాయంత్రం సరిగ్గా ఆరు గంటలకి రెండు జీప్‌లు హోటల్ ఆవరణలో ప్రవేశించేయి. ఒకదాంట్లో స్థానిక

సెక్యూరిటీ ఆఫీసర్లూ, మరో దాంట్లో ప్రొఫెసర్ అగర్వాల్ ఉన్నారు.

పైన హోటల్ గది కిటికీలోంచి బైనాక్యులర్స్‌తో ఈ దృశ్యం చూస్తున్న డేవిడ్ వెనక్కి తిరిగి— "ప్రొఫెసర్ వచ్చేడు." అన్నాడు పృథ్వీరాజ్‌తో.

గదిలో టేబిల్ మీద రిసీవింగ్ సెట్ పెట్టుకు కూర్చున్న పృథ్వీరాజ్ తలూపేడు. అరగంట క్రితమే అతను ప్రొఫెసర్ గదిలో ఎవ్వరికీ కనిపించని స్థానంలో చిన్న మైక్రోఫోన్ అమర్చి వచ్చేడు.

డేవిడ్ తిరిగి పార్కింగ్ ప్లేస్ వైపు చూసేడు. ప్రొఫెసర్ వెంట వచ్చిన సెక్యూరిటీ ఆఫీసర్ల జీప్, అతన్ని వదిలేసి తిరిగి వెళ్ళిపోతోంది. ప్రొఫెసర్ జీప్ దిగి హోటల్ వైపు వస్తున్నాడు.

డేవిడ్ కిటికీ దగ్గర్నుంచి కదిలి పృథ్వీరాజ్ దగ్గరికి వచ్చి కూర్చున్నాడు. పావు గంట తరువాత, బల్ల మీది రిసీవింగ్ సెట్లోంచి ప్రొఫెసర్ కూనిరాగం వినిపించ సాగింది.

అంటే, అతను తన గదిలోకి వచ్చేడన్న మాట. కొద్ది సేపటికి ప్రొఫెసర్ ఫోన్ ఎత్తి, ఆపరేటర్‌తో ఓ నెంబర్ అడగడం వినిపించింది. అవతలినించి ఏమన్నారో వాళ్ళు వినలేక పోయేరు.

తరవాత ప్రొఫెసర్ కంఠం మారు మ్రోగింది— "ఈ రాత్రి ఎవరు దొరుకుతారు?"

జవాబు సరిగా వినిపించటం లేదు.

మళ్ళీ ప్రొఫెసర్ కంఠం పలికింది. "నో.నో. లిల్లీ అంటే నాకిష్టం లేదు. ఆఁ! మేరీ ఐతే ఫరవాలేదు. ఆమె లేకుంటే

వీనస్‌ని పంపండి. నేను సరిగ్గా ఎనిమిదిన్నరకి బార్‌లోకి వస్తాను. తిరిగి పదిగంటలకి రూంకు వచ్చేస్తాను" అని రిసీవర్ క్రెడిట్ చేసిన చప్పుడు.

అంతా విన్న పృథ్వీరాజ్ సాలోచనగా తలూపి, "ప్రొఫెసర్ గ్రంథసాంగుడన్న మాట!" అన్నాడు.

"అందుకే అతను వారానికి నాలుగురోజులు కెమికల్ ఫర్మ్‌లో పనిజేసి, మిగతా మూడురోజులు కులాసాకోసం ఇక్కడ గడుపుతాడు. ఇప్పుడు మీ ప్రోగ్రాం ఏమిటి?" అడిగాడు డేవిడ్.

పృథ్వీరాజ్ లేచి, ఓ తోలు బాక్స్ అందుకుని భుజానికి తగిలించుకున్నాడు. అది కనిపించకుండా, పైనుంచి ఓవర్ కోట్ తొడుక్కుని— "చీకటి పడింది. మూడో కంటికి కనిపించకుండా వెళ్ళి పార్కింగ్‌లో ఆగివున్న ప్రొఫెసర్ జీప్‌లో టైం బాంబ్ ఫిట్ జేస్తాను. తరవాత, నిర్ణీత టైం ప్రకారం రాజారెడ్డిగార్ని కలుసుకోవాలి," అన్నాడు కిటికీవైపు నడుస్తూ.

5

సరిగ్గా ఎనిమిది గంటల ఇరవై ఎనిమిది నిమిషాలకి షీల కళ్ళు చెదర గొట్టేలా తయారై తన గదిలోంచి బైటికి వచ్చింది. గోడకి ఉన్న బటన్ వత్తి లిఫ్ట్‌ని పైకి పిలిపించింది.

లిఫ్ట్ రాగానే అందులో కాలు పెట్టబోతూ ఏదో జ్ఞాపకం వచ్చినట్టు ఆగి "ఓహ్! నా నెక్లెస్ మర్చిపోయేను. రెండు నిమిషాలు ఆగగలవా?" అంది లిఫ్ట్ బోయ్‌తో.

అతను తలూపేడు.

షీల చకచక తన గదివైపు నడిచింది.

ఇంతలో కింది అంతస్తునించి ఎవరో లిఫ్ట్ కోసం బెల్ వత్తేరు. లిఫ్ట్‌బోయ్ పట్టించుకోలేదు. అతను షీలకోసం ఎదురు చూస్తున్నాడు.

రెండు నిమిషాల తరవాత, షీల అందమైన నెక్లెస్ మెడలో అలంకరించుకుని తిరిగివచ్చింది. అప్పటికే కింద అంతస్తులోంచి లిఫ్ట్ కోసం ఆరుసార్లు బెల్ మోగడం జరిగింది.

లిఫ్ట్ కింద అంతస్తుకి వెళ్ళి ఆగింది. తలుపు దగ్గర ప్రొఫెసర్ అగర్వాల్ నిల్చునున్నాడు. కోపంతో అతని మొహం ఎర్రబడుంది. బాయ్‌ని ఉరిమి చూస్తూ లిఫ్ట్‌లోకి వచ్చి "ఎన్ని సార్లు బెల్ మోగించేను? నీకు..." అంటూ షీలను చూసి ఆగిపోయేడు.

ఆమెని చూడగానే అతని కళ్ళు తళతళమని మెరవసాగేయి. షీల నవ్వి—"అందులో అతని తప్పేం లేదు. నా హారం గదిలో మరిచిపోయినందుకు కాసేపు నేనే ఆగమన్నాను" అంది.

ప్రొఫెసర్ నాలికతో పెదాలు తడుపుకుని "డోంట్ వర్రీ మిస్! ఇంతకీ మీరీ హోటల్లో కొత్తగా వచ్చేరా?" అడిగేడు. షీల తలూపి "ఔను. ఈరోజే దిగేను. మీరు?" అంది ప్రశ్నార్థకంగా.

ప్రొఫెసర్ నవ్వి—"నాకిక్కడ ఓ పర్మినెంట్ గది ఉంది. అప్పుడప్పుడూ వస్తూపోతూంటాను," అన్నాడు.

షీల పర్సులోంచి చిన్న అద్దం తీసి తన మేకప్ చూసుకుంటూ "అంటే, మీకీ ద్వీపవాసులే నన్న మాట!" అంది.

ప్రొఫెసర్ తలూపి, "ఔను! మీరెక్కణ్ణించి వచ్చేరు? మీగురించి తెలుసుకోవచ్చా?" అడిగేడు.

"మాది స్విట్జర్లాండ్. నా పేరు లోరెన్స్!" అంది షీల అతనికి కళ్ళల్లోకి చూస్తూ.

"మీలాగే మీ పేరు కూడా చాలా అందంగా ఉంది. నన్ను ప్రొఫెసర్ అగర్వాల్ అంటారు. మీ వెంట ఇంకెవ్వరైనా ఉన్నారా?"

"నో.నో.! నేనొక్కదాన్నే వచ్చేను. కొన్నాళ్ళీ ద్వీపంలో కులాసాగా గడపడానికి!" అంది షీల 'కులాసా' అనే పదాన్ని వత్తి పలుకుతూ.

ప్రొఫెసర్ కళ్ళు తళ తళమన్నాయి. "ఈ రాత్రి డిన్నర్ నాతో తీసుకోడానికి మీకేమైనా అభ్యంతరమా?" అడిగేడు.

షీల నవ్వు—"నో! నాకేం అభ్యంతరం లేదు" అంది.

రాజారెడ్డి ఆదేశానుసారం, ప్రొఫెసర్‌తో పరిచయం జేసుకోడానికి షీల వేసిన ఎత్తు ఆ విధంగానే ఫలించింది.

లిఫ్ట్ దిగగానే ఇద్దరూ బార్‌రూం వైపు నడిచేరు. రంగు రంగుల దీపాలతో, రకరకాల మత్తు పానీయాలతో అలంకరిచబడుంది బార్.

ఓ ఖాళీ రౌండ్ టేబిల్ ముందు కూర్చున్నారిద్దరు. వెయిటర్ రాగానే రెండు షాంపెన్ బాటిల్స్, ఐస్ బాగ్ ఫ్రైచికెన్ తెమ్మన్నాడు అగర్వాల్.

ఐదు నిమిషాల్లో వారి టేబిల్ నిండిపోయింది. గంట లోగా మంచి కైపులోకి వచ్చేడు ప్రొఫెసర్. మాట్లాడు తోంటే ముద్దుగా వస్తున్నాయి మాటలు. షీల తన గ్లాసులోకి షాంపెన్ ఒంపుకున్నట్టు ఒంపుకుని, ప్రొఫెసర్ కళ్ళు గప్పి, దాన్ని ఐస్ బాగ్‌లో పోస్తూ ఇంతవరకూ నెట్టుకొచ్చింది.

ప్రొఫెసర్ కళ్ళుమాత్రం ఆకలితో దహించుకుపోతూ ఆమెని చూస్తున్నాడు. ఆమె గ్లాసులో కొసరి కొసరి బాటిల్ ఒంపుతున్నాడు. బాగా తాగిస్తే సులువుగా లొంగదీసుకోవచ్చని అతని ఆశ.

"ఇక చాలు. తాగుతూంటే ఆకలి ఎక్కువవుతోంది. భోజనం తెప్పించండి" అంది షీల.

వైటర్ని పిలిచి వెంటనే భోజనం తెప్పించాడు ప్రొఫెసర్. భోజనాలయ్యాక ఆవులిస్తూ ఒళ్ళు విరుచుకుని "ఇక నే వెళతాను" అంది షీల.

"అప్పుడేనా?" ప్రొఫెసర్ కంఠంలో నిరాశ ధ్వనించింది.

"క్షమించాలి ఈ రోజు బాగా అలసిపోయి వున్నాను. మళ్ళీ రేపు కలుసుకుందాం. గుడ్ నైట్!" అంటూ లేచింది షీల.

విధిలేక తలూపేడు అగర్వాల్. ఈ రాత్రి ఎలాగూ ఓ అమ్మాయి ఏర్పాటవుతోంది కదా? ఈమె విషయం రేపు చూసుకోవచ్చు అనుకున్నాడు మనసులో.

షీల గుడ్ నైట్ చెప్పి వెళ్ళిపోయింది.

ఇంతలో ఓ వైటర్ ప్రొఫెసర్ దగ్గరికి వచ్చి, రహస్యంగా అతని చెవిలో ఏదో చెప్పేడు.

ప్రొఫెసర్ కళ్ళు మెరిసేయి.

తలూపుతూ లేచి, తడబడే అడుగులతో తన గది జేరుకున్నాడు.

అప్పటికే అతని గదిలో ఓ అమ్మాయి వచ్చివుంది.

లోపలికెళ్ళి తలుపు మూసుకున్నాడు ప్రొఫెసర్.

సరిగ్గా అదే సమయంలో అక్కడ రాజారెడ్డి, పృధ్వీ

రాజ్‌లు ఎంతో చాకచక్యంతో ప్రొఫెసర్ అగర్వాల్ తాలూకు కెమికోఫర్మ్ ఆఫీసులో ప్రవేశించి, అక్కడి ఫైళ్ళూ, కాగితాలూ, వస్తువులూ చెల్లాచెదరుగా కింద విసిరేసి, గండు పిల్లుల్లా తిరిగి బైటపడ్డారు.

అంతకి ముందే పృథ్వీరాజ్ నేర్పుగా హోటల్ పార్కింగ్ లో వున్న ప్రొఫెసర్ జీప్ పెట్రోల్ కింద, శక్తివంతమైన టైంబాంబ్ ఫిట్ జేసి రెడీగా వుంచేడు.

6

రాత్రి పదకొండు గంటలకి తన గదిలోని బాత్ రూంలో దూరేడు రాజారెడ్డి. లైటర్ తీసి, ఏరియల్ లాగి, బటన్ వత్తేడు.

అవతలినించి డేవిడ్ కంఠం వినిపించగానే, వాళ్ళకి ఇన్‌స్ట్రక్షన్స్ ఇవ్వసాగేడు.

“సరిగ్గా పన్నెండు గంటలకి, మీ గది కిటికీలోంచి నైలాన్ తాడు అవతలికి విసిరి, కావలసిన సామానుతో నీవూ, పృథ్వీరాజ్ కిందికి జేరుకోండి. చీకట్లో జాగ్రత్తగా కారు పార్కింగ్ లో కెళ్ళి అక్కడ నేను అద్దెకి తీసుకున్న బ్లూ షెవర్లెట్ లో కూర్చుని నాకోసం వెయిట్ జెయ్యండి.

మీ వెనకే నేనూ కిందికి వస్తాను. ముగ్గురం రాత్రి ఒంటి గంటలోగా, వాస్కా సరస్సు ప్రాంతాలకి జేరుకోవాలి. సరస్సు కివతల రాత్రింబవళ్ళూ, మిలటరీ సైనికులూ, వారికి తోడుగా శత్రువుని చీల్చిచెండాడే భయంకరమైన కుక్కలూ గస్తీ తిరుగుతుంటాయి.

మనం సైనికుల బారినుంచి తప్పించుకున్నా, ఆకుక్కల వాసన శక్తినించి తప్పుకోలేం. అందుకే, పృథ్వీరాజ్

తయారుజేసిన సూపర్ సోనిక్ యంత్రాన్ని మన దగ్గర రెడీగా వుంచుకోవాలి.

మన అదృష్టం బావుండి, ఆ కుక్కల బారినించి తప్పించుకున్నామంటే, ఇహ సరస్సు ఈది అవతలికి జేరుకోవాలి. సరస్సు ఈదడం కూడా అంత సామాన్య విషయం కాదు. అవతలి ఒడ్డునించి వాచ్ టవర్ సెర్చి లైట్ రాత్రంతా ఆ సరస్సు చుట్టూ ఫోకస్ జేస్తుం టుంది. నీటిపైన ఈదితే మనం స్పష్టంగా కాపలా వాళ్ళకి కనిపిస్తాం కనుక, నీళ్ళలో మునిగి అవతలి ఒడ్డువరకూ వెళ్ళవలసి వుంటుంది.

అందుకని మన వెంట ఆక్సిజన్ సిలిండర్స్, స్విమ్మింగ్ డ్రెసెస్ తప్పని సరిగా వుండి తీరాలి.

అవతలి ఒడ్డు జేరేక, అడవి గుండా కొద్ది దూరం నడ స్తే లేబరేటరీ వస్తుంది. ఆ లేబరేటరీ చుట్టూ పెద్ద ఫెన్సింగ్ వుంటుంది. ఆ ఫెన్సింగ్ లో ఇరవై నాలుగ్గంటలూ కరెంట్ పాస్ అవుతుంటుంది. ఫెన్సింగ్ అవతల మళ్ళీ సైనిక కాపలా వుంటుంది.

అటువంటి పద్మవ్యూహాన్ని ఛేధించుకుని లేబరేటరీలో ప్రవేశించాలి. అప్పుడు గానీ, ప్రపంచ విపత్తుకి మూల స్థావరమైన ఆ లేబరేటరీని ధ్వంసం జెయ్యలేం!

ప్రతి అడుగు చూచి చూచి వేయాలి. ఎంతో జాగ్రత్తా మెళకువా అవసరం. ముగ్గురం సజీవంగా తిరిగి వస్తామో, ఒకరిద్దరం మిగిలివస్తామో చెప్పలేను. ప్రాణాలు పోయినా, వున్నా, ఏది ఏమైనా సరే మన ప్రయత్నం మనం జేసి తీరాలి!''

''ఓకే సర్!'' డెవిడ్ కంఠం దృఢంగా వినిపించింది.

రాజారెడ్డి ట్రాన్స్‌మిటర్ ఆఫ్ జేసి జేబులో వేసుకున్నాడు.

7

వాస్కా సరస్సుకి ఫర్లాంగు ఇవతల రోడ్డు పక్క పొదల్లో కారాపి దిగేరు ముగ్గురు. చుట్టూ మసక చీకటి, కీచురాళ్ళ రొద. దూరాన, సెర్చ్‌లైట్ కాంతి సరస్సు మీద పడుతూ గుండ్రంగా తిరుగుతోంది.

కావలసిన సామాను కార్లోంచి తీసుకుని, ముగ్గురూ ముందుకి సాగేరు. పొదల చాటున నక్కుతూ, నాలుగు వైపులూ జాగ్రత్తగా చూసుకుంటూ కాపలా వాళ్ళ బూట్సుల శబ్దం వినిపించగానే చెట్ల గుబురుల్లో ఒదుగుతూ గంట తరవాత సరస్సుని సమీపించేరు.

సరిగ్గా అదే సమయంలో దూరాన కుక్కలు మొరగడం వినిపించింది. "పృథ్వీరాజ్! త్వరగా నీ పని కానియ్!" అన్నాడు రాజారెడ్డి చేతిలో పిస్తోలు సేఫ్టీ కాచ్ వెనక్కి లాగుతూ.

పృథ్వీరాజ్ వెంటనే, భుజానికి వేలాడుతున్న నల్ల రంగు బాక్సుని తీసి నేలమీద పెట్టి డయల్స్ తిప్ప సాగేడు. "త్వరగా కానివ్వు! కుక్కలు మన వాసన పట్టేశాయి!" అన్నాడు రాజారెడ్డి ఆత్రుతగా.

పృథ్వీరాజ్ చకచక వైర్ జాయింట్ జేసి, స్విచ్ ఆన్ జేసేడు. మెషీన్‌లోంచి ఎలాంటి శబ్దం రాలేదు. కాని, మెషీన్ తన పని ప్రారంభించిది.

నిజానికి, ఆ మెషీన్ లోంచి ఒకవిధమైన రేడియో తరంగాలు నిశ్శబ్దంగా, వేగంగా వెదజల్లబడతాయి. ఆ తరంగాలు మనుషులకి వినబడవు. వాటిని కేవలం జంతు

వులే పసిగడతాయి. ఆ తరంగాల శబ్దం కోటి రాబందులు ఒక్కసారి అరుస్తున్నట్టు అతి భయంకరంగా వుంటుంది. ఆ కేకలు విన్న జంతువులు భయపడి ఏదో ముంచుకు వచ్చినట్టు తలో దిక్కు దౌడు తీస్తాయి.

ఆదే జరిగింది. మెషీన్ స్విచ్ ఆన్ చేసిన మరుక్షణం అంతవరకూ వినిపిస్తున్న కుక్కల అరుపులు ఠకీమని ఆగి పోయేయి. అవి చటుక్కున వెనుదిరిగి ఎవ్వరో కొడు తున్నట్టు గొంతెత్తి ఏడుస్తూ తలో వైపు పారిపో సాగేయి.

అకస్మాత్తుగా వాటికేమైందో అని వాటి వెంటవున్న కాపలాదార్లు నివ్వెరబోయేరు.

"థ్యాంక్యూ మిస్టర్ పృథ్వీరాజ్! ఇహ అపాయం లేదు. వెంటనే స్విమ్మింగ్ డ్రెస్‌లు తొడుక్కుని ఆక్సిజన్ సిలిండర్లు వీపుకి కట్టుకోండి. సరస్సులో దిగిన మరుక్షణం ఏమాత్రం పైకి తేలకుండా లోలోపల ఈతుదూ అవతలి ఒడ్డుకు చేరాలి.

ఒక విషయం మరిచిపోవద్దు. ఈసరస్సులో 'ప్రీహాన్స్' అనబడే భయంకరమైన చేపలున్నాయి. వాటికి మనిషి మాంసమంటే ఎంతో ప్రీతి. చూడటానికి అవి చిన్న చేపలే ఐనా, వాటి దవడలూ, పళ్ళూ ఎంతో వాడిగా వుంటాయి. సరస్సులో మనిషి కనిపించిన మరుక్షణం అవి తండోపతండాలుగా వచ్చి చుట్టు ముట్టేస్తాయి.

"చూస్తూ చూస్తూనే చెట్టంత మనిషి కేవలం అస్థిపంజ రంగా మిగిలిపోతాడు" అన్నాడు రాజారెడ్డి.

"మీరు నిశ్చింతంగా వుండండి. ఈ సూపర్ సోనిక్ యంత్రం వాటి పని పడుతుంది" అన్నాడు పృథ్వీరాజ్.

ఐదు నిమిషాల్లో ముగ్గురూ స్విమ్మింగ్ డ్రెస్‌లు తొడుక్కొని సరస్సులో దిగేరు. నీటిలో మునిగి కొద్ది దూరం వెళ్ళారో, లేదో, నాలుగు వేపులనించీ తండోపతండాలుగా వస్తూ వారిని చుట్టుముట్టసాగేయి ప్రీహాన్స్ చేపలు.

పృథ్వీరాజ్ వెంటనే, తన నడుం మీద బెల్ట్ బక్కుల్‌కి వేళాడుతున్న మెషీన్ స్విచ్ వత్తేడు అంతే! మరుక్షణం నీటిలో ప్రళయం వచ్చినట్టయింది. చేపలన్నీ గిరుక్కున వెనుదిరిగి పోసాగేయి.

వేగంగా ఈదుతూ అరగంటలో ముగ్గురూ అవతలి ఒడ్డుకి జేరుకున్నారు. ఎంతో జాగ్రత్తగా, మసక చీకట్లో పొదల చాటుమాటున నక్కుతూ, ముందుకి సాగేరు.

అలా ఫర్లాంగు దూరం వెళ్ళేక, దూరాన కనిపించింది లేబొరేటరీ బిల్డింగ్! దాని చుట్టూ ఎత్తైన ఫెన్సింగ్ వుంది దాని లోపలే మళ్ళీ సైనికులు కాపలా ప్రారంభమౌతుంది.

ఫెన్సింగ్‌ని సమీపించగానే ముగ్గురూ నేలమీద బోర్లాపడుకున్నారు. పృథ్వీరాజ్ తన బ్యాగ్‌లోంచి గ్లవుస్ కటింగ్ ప్లేయర్ తీసి, గ్లవుస్ చేతులకి తొడుక్కొని, కటింగ్ ప్లేయర్‌తో జాగ్రత్తగా ముళ్ళతీగ కట్ జేసేడు.

అంతే! మరుక్షణం నాలుగు వైపుల నించీ బిగ్గరగా అలారం మోతలు వినిపించ సాగేయి.

ముగ్గురి గుండెలూ దడదడ మన్నాయి.

"పొరబాటు జరిగిపోయింది. తీగ కట్ చెయ్యగానే, దాంట్లో పాస్ అవుతున్న కరెంట్ ఆగిపోయి, అలారంలని ఇండికేట్ జేసింది. ఇటువంటి ఏర్పాటు ఉంటుందని ఊహించలేదు." అన్నాడు పృథ్వీరాజ్ నిరాశగా.

అప్పటికే లోపలినించి కాపలా వాళ్ళ బూట్సుల చప్పుళ్ళూ కేకలూ వినిపించసాగేయి. అంతవరకూ ఒకే ఒక సెర్చిలైట్ తిరుగుతున్నదల్లా ఇప్పుడు మరో మూడు వెలిగేయి. ప్రమాదాన్ని సూచించే సైరన్ మోగసాగింది.

"ఇప్పుడేం జేద్దాం?" అడిగేడు డేవిడ్ ఖంగారుగా.

"ప్లాన్ ఫేలయింది! వెనుదిరిగి సరస్సులో దూకండి. హారియప్." అన్నాడు రాజారెడ్డి నేలమీంచి లేస్తూ.

ముగ్గురూ తమ తమ సామాను అందుకుని సరస్సు వైపు పరిగెత్తేరు. సరస్సులో దూకి, అరగంటలో ఆవలి ఒడ్డు జేరుకున్నారు. క్షణం వృధా జెయ్యకుండా శక్తికొద్దీ పరుగు తీసేరు.

మరో పదిహేను నిమిషాల్లో కారు విడిచిన చోటికి జేరుకున్నారు. కార్లో కూర్చోగానే స్టార్ట్ జేసి, లైట్సు ఆన్ జెయ్యకుండా, నగరం వైపు పరిగెత్తించేడు డేవిడ్.

8

టెలిఫోన్ గణ గణ మోగడంతో నిదరలోంచి ఉలిక్కిపడి కళ్ళు తెరిచేడు ప్రొఫెసర్ అగర్వాల్. కిటికీ లోంచి సూర్యకిరణాలు గదిలో పడుతున్నాయి.

టైం చూసేడు. ఎనిమిది గంటలు. అప్పటికే పక్కలో ఉన్న అమ్మాయి లేచి వెళ్ళిపోయింది.

చటుక్కున రిసీవర్ అందుకుని, "ఎస్! అగర్వాల్ స్పీకింగ్" అన్నాడు.

"సార్! లేవగానే మీకీ దుర్వార్త చెప్పవలసి వచ్చినందుకు చింతిస్తున్నాము. రాత్రి మన కెమికల్ ఆఫీస్‌లో ఎవ్వరో దొంగతనంగా ప్రవేశించి, ఫైళ్ళూ కాగితాలూ చిందరవందర జేశారు. విలువైన వస్తువులేవీ పోలేదు.

దాన్ని బట్టి వాళ్ళు మామూలు దొంగలు కారనీ, ఏదో సీక్రెట్ మేటర్ కోసం వెతకడానికి వచ్చేరనీ తెలుస్తోంది." అన్నాడు అవతలినించి అతని సెక్రెటరీ.

ప్రొఫెసర్ ముఖం చిట్లించి– "నీకేమైనా మతి పోయిందా?" అన్నాడు నమ్మనట్టు.

"నో సార్! మీకు నమ్మకం లేకుంటే, స్వయంగా వచ్చి చూడండి. ఆఫీసు తెరిచేక, అక్కడి దృశ్యం చూడగానే తక్షణం సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ లెఫ్టినెంట్ జనరల్ గ్రోమేజ్ గారికి ఫోన్ జేసేను. ఆయన కొందరు ఆఫీసర్లని వెంటబెట్టుకుని హుటాహుటిన వచ్చేరు. వాళ్ళింకా ఇక్కడే ఉన్నారు. అన్నట్టు చెప్పడం మరిచేను సార్!

నిన్న ఎవ్వరో డాక్టర్ ఘోష్ అనే వ్యక్తి మీ కోసం ఫోన్ జేసేరు..."

ఆ పేరు విన్న ప్రొఫెసర్ గుండె గుభిల్లుమంది! వణికే కంఠాన్ని తమాయించుకుంటూ– "ఆల్ రైట్! ఇప్పుడే వస్తున్నాను." అని రిసీవర్ పెట్టేసేడు.

'డాక్టర్ ఘోష్' హఠాత్తుగా ఆ పేరు వినగానే, తాము భారతదేశంలో పనిజేసిన లేబొరేటరీ, ఆ లేబొరేటరీకి డైరెక్టర్ అయిన డాక్టర్ ఘోష్ మెరుపులా మెరిసేరు ప్రొఫెసర్ బుర్రలో.

తామీ దేశంలో తలదాచుకున్నట్టు భారతదేశానికి తెలిసిపోయిందా? తమ విషయం ఆరా తియ్యడానికి డాక్టర్ ఘోష్ నాయకత్వాన గూఢచారుల్ని పంపిందా? రాత్రి కెమికో ఆఫీస్‌లో వాళ్ళే ప్రవేశించేరా? ఇలాటి అనుమానాలతో ప్రొఫెసర్ శరీరం వేపాకులా వణక సాగింది.

ఇంతలో మళ్ళీ ఫోన్ గణగణ మోగింది.

ప్రొఫెసర్ రిసీవర్ అందుకుని– "ఎస్!" అన్నాడు.

"సార్! అత్యంత తీవ్రమైన విషయం. రాత్రి ఎవ్వరో సరస్సు దాటి, లేబొరేటరీని సమీపించి, ఫెన్సింగ్ కట్ జెయ్యడానికి ప్రయత్నించేరుట.

అదృష్టవశాత్తూ వాళ్ళ ప్రయత్నం ఫలించలేదు. కాపలా వాళ్ళు ఎంత వెదికినా కనిపించకుండా పారి పోయేరుట."

దిగ్భ్రాంతితో క్షణంపాటు ప్రొఫెసర్ నోరు పెగల్లేదు. తరువాత తేరుకుని వస్తున్నానని చెప్పి రిసీవర్ పెట్టేసేడు.

ఇప్పుడు ప్రొఫెసర్‌కి పూర్తి నమ్మకం ఏర్పడింది. ఆ పని భారత గూఢచారులదేనని. దాంతోబాటు అతనిలో చెప్పలేని భయం కూడా విజృంభించింది.

ఆదరా బాదరా తయారై జీప్ ఎక్కి బైలుదేరేడు. కమిషన్ ఆఫీస్ ఆవరణలో, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ లెఫ్టినెంట్ జనరల్ గ్రోమేజ్, ప్రొఫెసర్ సెక్రెటరీ ఎదురయ్యేరు.

జనరల్‌ని చూడగానే ప్రొఫెసర్ మొహం ఎర్ర బడింది. "వాటీజ్ దిస్ యువర్ కేర్‌లెస్ జాబ్ జనరల్? మీ దేశంలో మా ఆఫీస్‌కి, లాబొరేటరీకే రక్షణ లేనప్పుడు ఇక మా ప్రాణాలకి రక్షణ వుంటుందని ఎలా నమ్మడం?" అన్నాడు తీక్షణంగా.

ప్రొఫెసర్ అగర్వాల్, ప్రొఫెసర్ బీరేంద్రనాథ్ ముఖర్జీల రక్షణ భారం గ్రోమేజ్ పైనే వుంది. అతను ఆ దేశ అధ్యక్షుడైన జనరల్ ఫెర్నాండెజ్ కుడి భుజం.

"క్షమించండి ప్రొఫెసర్! మా ఏర్పాట్లలో ఎక్కడో

చిన్న లోపం జరిగిపోయింది. వివరాలందిన తక్షణం మన సెక్యూరిటీ దళానికి ఆదేశాలు జారీ చేశాను, ఆ దుండగు లెక్కడున్నా వెంటనే కూపీతీసి పట్టుకోమని. ఈ విష యంలో మీరు నిశ్చింతగా వుండండి. రక్షణ ఏర్పాట్లని ఇంకా కట్టుదిట్టం చేశాం!" అన్నాడు జనరల్ గ్రోమేజ్ వినయంగా.

ప్రొఫెసర్ లోనికెళ్ళి కాసేపు ఆఫీసు తనిఖీ చేసి బైటికి వచ్చేడు.

"పదండి ఓసారి లేబొరేటరీకి వెళ్ళి చూద్దాం!" అన్నాడు జనరల్‌తో. అందరూ జీపుల్లో బైలుదేరేరు.

* * *

రాజారెడ్డి కోరిన కిరాయి హెలికాప్టర్ వచ్చి ఏర్‌పోర్ట్‌లో దిగింది. దానికోసమే అక్కడ ఎదురు చూస్తున్న రాజారెడ్డి గబగబ వెళ్ళి పైలెట్‌కి తనను పరిచయం చేసు కుని కాక్‌పిట్ ఎక్కి కూర్చున్నాడు. అతని మెడలో బైనాక్యూలర్స్, ఓ కెమెరా వ్రేలాడుతున్నాయి.

ప్రొఫెసర్ నిదర లేవగానే రాత్రి జరిగిన సంఘటనలు అతనికి తెలుస్తాయనీ, అతను వెంటనే లేబొరెటరీకి బైలు దేరతాడనీ రాజారెడ్డికి తెలుసు.

హెలికాప్టర్ని ఏవైపు తీసుకెళ్ళాలో పైలెట్‌కి వివ రించేడు. మరు క్షణం ఇంజన్ స్టార్టయి హెలికాప్టర్ పైకి లేచింది.

పైలెట్, నెలసరి జీతంమీద ఒకరి దగ్గిర పని చేస్తు న్నాడు. గనుక కస్టమర్ హెలికాప్టర్ని ఏవైపు తీసు కెళ్ళమన్నాడూ, ఎందుకు తీసుకెళ్ళమన్నాడూ, అని ఆలోచించే అవసరం లేదు. కస్టమర్ ఎటు తీసుకెళ్ళ

మంటే, అటు తీసికెళ్ళి అడ్డె వసూలు జెయ్యడం అతని డ్యూటీ!

రాజారెడ్డి కాక్‌పిట్‌లోంచి బైనాక్యులర్స్ ద్వారా తన గమ్యం దగ్గిర పడుతూన్నదో, లేదో చూస్తూ కూర్చున్నాడు. కాసేపట్లోనే సుదూరాన సరస్సు కనిపించింది.

సరస్సు వైపు వెళ్ళే ఓ మట్టి రోడ్డుమీద రెండు జీపులు పోతూ కనిపించేయి. ఆ జీపుల్లోనే ఒక దాంట్లో ప్రొఫెసర్ అగర్వాల్ ఉండివుంటాడు.

చిన్నగా నవ్వుకుంటూ మెడలో వేళాడుతున్న కెమెరాని సరిజేసుకున్నాడు రాజారెడ్డి. ఆ కెమెరాలో ఓ పుష్ బటన్ వుంది. అది వత్తిన మరుక్షణం కెమెరా లెన్స్ ద్వారా తీవ్రమైన రేడియో తరంగాలు ప్రసారమౌతాయి.

ఆ తరంగాలకీ, ప్రొఫెసర్ జీప్ పెట్రోల్ టాంక్ కింద అమర్చిన టైంబాంబుకీ లింక్ వుంది. కెమెరాలోంచి రేడియోతరంగాలు బైటపడ్డ మరుక్షణం ఆ బాంబు పేలుతుంది.

చూస్తూ చూస్తూనే జీప్‌లు సరస్సు ఒడ్డున ఆగేయి. అందులోంచి ప్రొఫెసర్‌తోబాటు, మిగతా బలగం దిగింది. సరస్సు అవలివైపు వెళ్ళడానికి ఓ మిలటరీ బోట్ సరస్సులో తేలుతోంది. అందరూ బోట్‌వైపు వెళుతున్నారు.

సరిగ్గా అదే సమయంలో రాజారెడ్డి కెమెరా బటన్ వత్తేడు.

* * *

"ఢాం!" అనే ప్రేలుడుతో అందరూ అదిరిపడి వెనుదిరిగి చూసేరు.

ప్రొఫెసర్ జీప్‌లో మంటలు లేచాయి! క్షణం పాటు ఏం జరిగిందో, అది కలో_మాయో అర్థం కాలేదు వాళ్ళకి.

దిగ్భ్రాంతినించి తేరుకున్న ప్రొఫెసర్‌కు వెంటనే జ్ఞాపకం వచ్చింది. జీప్ పెట్రోల్ టాంక్ నిండి వుందనీ, ఆ మంటలవల్ల అది బ్రస్ట్ అయి జీప్ ముక్కలై ఎగిరి పోతుందని. అందర్నీ కింద పడిపొమ్మని అరుస్తూ తనూ బోర్లా నేలమీద పడ్డాడు. సరిగ్గా అదే సమయంలో దిక్కులు పిక్కటిల్లే చప్పుడుతో జీపు ముక్కలై గాలిలోకి ఎగిరింది.

ఐదు నిమిషాల తరవాత అందరూ నేలమీంచి లేచారు. చుట్టు పక్కల అంతమంది వుండగా, అకస్మాత్తు ఆ సంఘటన ఎలా జరిగిందో, ఎంత బుర్రలు బద్దలు కొట్టుకున్నా, జనరల్ గ్రోమేజ్‌కూ, అతని అనుచరులకూ ఏమీ బోధ పడలేదు.

ప్రొఫెసర్ అగర్వాల్ బుర్రమాత్రం తీవ్రంగా పని చెయ్యసాగింది. ఇక సందేహంలేదు. ఇదంతా భారత గూఢ చారుల పనే అయివుంటుంది. తనని చంపడానికే వాళ్ళు జీపులో ఎక్కడో టైంబాంబు పెట్టివుంటారు.

తన అదృష్టం బావుండి బ్రతికిపోయేడు. ఇంతమంది సెక్యూరిటీ ఉన్నతాధికార్లు వెంట వున్నా, తన ప్రాణాలకి గ్యారంటీ లేకపోయింది. దీన్ని బట్టి భారత గూఢ చారులు ఏ క్షణంలోనైనా, ఎక్కడైనా సరే తనని సులువుగా చంపగలరని తేలిపోయింది.

భారతదేశం తన గూఢచారుల ద్వారా తమని చంపించి పగ తీర్చుకోవాలనుకుంటోంది. ఇహ ఈ దేశంలో ఒక్క క్షణం వుండకూడదు. ప్రొఫెసర్ ముఖర్జీతో మాట్లాడి,

అతన్ని ఒప్పించి, మూడో కంటికి తెలీకుండా మరే దేశానికైనా పారిపోవాలి!

అనుకుంటూ లేబొరేటరీలో పని జేస్తున్న ప్రొఫెసర్ బీరేంద్రనాథ్ ముఖర్జీని కలుసుకోవడానికి సరస్సులో తేలుతున్న బోట్ వైపు నడిచేడు అగర్వాల్.

మిగతా వాళ్ళంతా ఆ సంఘటన గురించే చర్చిస్తూ అతన్ని అనుసరించేరు.

9

ప్రొఫెసర్ ముఖర్జీతో మాట్లాడి, సాయంత్రం ఐదు గంటలకి హోటల్ కి తిరిగి వచ్చేడు అగర్వాల్.

లిఫ్టులో తిన్నగా పైకెళ్ళి తన గదిని సమీపించేడు. తలుపు మూసివున్న తీరు చూసి ఏదో అనుమానం వేసింది. జేబులో చెయ్యి పెట్టి, మునివేళ్ళతో తలుపు తోసేడు.

తెరుచుకుంది. గదిలో అడుగు పెడుతూ చటుక్కున రివాల్వర్ బయటికి తీసేడు. గదిలో ఎవ్వరూ లేరు. కాని, గది వున్న తీరు చూడగానే ఆశ్చర్యంతో అతని కళ్ళు పెద్దవయ్యేయి.

సామానంతా చిందరవందరగా పడుంది. మంచంమీది పరుపూ, దిళ్ళూ ఎవ్వరో బ్లేడతో కోసి, దూది పీకి గదంతా వెదజల్లేరు. సందేహం లేదు. ఎవ్వరో తను లేనప్పుడు మారు తాళంతో తలుపులు తెరిచి దేనికోసమో వెదికేరు. భారత ఏజెంట్లేనా? ఈ ఆలోచన రాగానే ప్రొఫెసర్ కాళ్ళూ చేతులూ వణకసాగేయి.

అనుకోకుండా అతని దృష్టి టేబిల్ మీద రెపరెప లాడుతున్న కాగితం మీద పడింది. ఏమిటా అనుకుంటూ గబగబ అటు నడిచేడు.

అది ఉత్తరం! మూడే మూడు పంక్తులున్నాయి.

"ప్రొఫెసర్! నీవ్వూ, ముఖర్జీ మానించి తప్పించుకో లేరు. మీరు చేసిన ద్రోహానికి తగిన శిక్ష విధించబడుతుంది. మీ ప్రాణాలు మా గుప్పిట్లో వున్నాయ్!"

అంతే! ఆ మూడు పంక్తులు ప్రొఫెసర్ శరీరాన్ని చమటతో తడిపేసేయి.

ఇంతలో బాత్ రూం వైపునించి విచిత్రమైన శబ్దం వినిపించడంతో చటుక్కున అటు తిరిగేడు ప్రొఫెసర్. బాత్ రూం తలుపు మూసివుంది. లోపల ఎవ్వరైనా వున్నారా? దడదడ లాడే గుండెతో రివాల్వర్ రెడీగా పట్టుకుని అటు నడిచేడు.

మెల్లిగా తలుపు తోసేడు. కిర్రుమంటూ తెరుచుకుంది. లోపలి దృశ్యం చూడగానే ప్రొఫెసర్ బుర్ర గిరగిర తిరగసాగింది. నేలమీద తాళ్ళతో చేతులు వెనక్కి విరిచి కట్టేయబడుంది మిస్ లోరెన్స్! అరవకుండా నోట్లో గుడ్డ పీలికలు. కాళ్ళు రెండూ కలిపి కట్టేసి వున్నాయి.

కళ్ళు తెరిచి నిస్సహాయంగా చూస్తోంది!

ప్రొఫెసర్ ఆశ్చర్యంలోంచి తేరుకుని, గబగబ ఆమె కట్లు విప్పి "మిస్ లోరెన్స్! మీరిక్కడికెలా వచ్చేరు? ఎవ్వరు కట్టి పడేసేరు?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించేడు.

షీల బాధతో కాళ్ళూ చేతులూ విదిల్చుకుంటున్నట్టు నటిస్తూ చెప్పసాగింది. "ఉదయం మీ కోసం రెండు మూడు సార్లు గదికి ఫోన్ జేసేను జవాబు రాలేదు. బార్ రూంలోనూ, డైనింగ్ హాల్లోనూ వెదికేను. ఎక్కడా మీరు కనిపించలేదు. దాంతో పనిమీద ఎక్కడికో వెళ్ళి వుంటారని సరిపెట్టుకున్నాను.

ఎవ్వరి కంపెనీ దొరక్క, ఏమీ తోచక బోర్ కొడు తుంటే అనుకోకుండా ప్రిన్స్ ఖాసిమ్ ఉలేమాన్ గారు కనిపించేరు. ఆయన కువైట్ ఖలీఫా సోదరుడు. అదేపనిగా తన ప్రైవేట్ విమానంలో దేశ దేశాలు తిరుగుతూ, డబ్బుని మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చు చేస్తుంటాడు.

నిన్నటినించీ ఈ హోటల్లోనే మకాం జేసి వున్నాడుట. ఆయనకీ నాకూ ఒకసారి పారిస్‌లో పరిచయం కలిగింది. బోర్ కొడుతున్న నాకు, పగలు ఆయనతో మంచి కంపెనీ దొరికింది. మాటల మధ్య ఆయన మీ గురించి అడిగేడు. ఉదయంనించీ మీరు కనిపించడం లేదని చెప్పేను.

దాంతో ఆయన మీ గురించి ఏమన్నాడో తెలుసా? పాపం, ఆ ప్రొఫెసర్ చాలా ప్రమాదంలో వున్నాడు. ఏ క్షణంలోనైనా అతను హత్య జెయ్యబడవచ్చు. అతను సరేనంటే నేనతన్ని కాపాడి ఆదుకోగలను. అతన్ని ఎవ్వరు చంపదలచుకున్నారో, ఎందుకు చంపదలచు కున్నారో నాకు తెలుసు.

అంతేకాదు, ఆయన ప్రత్యేకంగా మిమ్మల్ని కలుసుకో డానికే వచ్చేడుట. కొలంబోలో చెడిపోయిన ఆయన జెట్ విమానం ఇప్పుడు బాగై, ఇక్కడి ఏర్‌పోర్ట్‌లో వచ్చి వుందిట. ఆయన ఏదో బిజినెస్ గురించి మీతో ఒప్పందం కుదుర్చుకోవాలనుకుంటున్నాడట.

నిన్న రాత్రి మనిద్దరం కలిసివుండటం ఆయన చూసే డుట. అందుకే నా ద్వారా మిమ్మల్ని పరిచయం జేసుకో వాలనుందని చెప్పేడు. ఆ విషయం గురించే మీతో మాట్లాడదామని సాయంత్రం నాలుగ్గంటలకి మీ గదికి వచ్చేను. తలుపు కొద్దిగా తెరిచివుంది.

తట్టగానే, లోపలినించి_ 'కమిన్' అని వినిపించింది. మీరే అయుంటారనుకుని తలుపు తోసి లోపలికొచ్చేను. అంతే! మరుక్షణం అంతవరకూ తలుపు పక్కన నక్కి వున్న వ్యక్తి, వెనకనించి నా నోరు నొక్కిపట్టుకున్నాడు. మరొకడు క్లోరోఫాంలో తడిపిన గుడ్డని నా ముక్కుకి అదిమిపెట్టేడు.

ఎంత గింజుకున్నా వారి పట్టు సడలలేదు. నా కళ్ళు బైర్లు కమ్మసాగేయి. అంతే, తరువాత ఏంజరిగిందో నాకు తెలియదు. స్పృహ వచ్చి చూస్తే బాత్‌రూంలో కట్టి పడున్నాను. మీరు వచ్చేరు గనక సరిపోయింది. ఇంతకీ ఎవ్వరు వాళ్ళు? మీరు లేకుండా మీ గదిలో ప్రవేశించి ఇంత దౌర్జన్యం జేస్తారా?"

"నావల్ల మీకీ కష్టం కలిగినందుకు క్షమించాలి మిస్ లోరెన్స్! కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నన్ను చంప డానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు.

ఇంతకీ, ప్రిన్స్‌ఖాసిమ్ ఉలేమాన్‌గారికి నేను ప్రమా దంలో వున్నట్టు ఎలా తెలిసింది?" అడిగేడు ప్రొఫెసర్ ఆశ్చర్యంగా.

"ఏమో, వెళ్ళి ఆయన్నే అడగండి. ఆయన నన్ను కోరిందల్లా మిమ్మల్ని పరిచయం జెయ్యమని!" అంది షీల.

భారత గూఢచారుల బారినించి ఎలా తప్పించుకో వాలా? ఈ దేశం విడిచి సురక్షితంగా ఎక్కడికి పారి పోవాలా? అని ఆలోచిస్తున్న ప్రొఫెసర్‌కి వెతకబోయిన తీగ కాలికి తగిలినట్టు తోచింది.

ప్రిన్స్‌ని వెంటనే కలుసుకుని సహాయం అర్థించాలి, అనుకుంటూ, "ఇప్పుడాయన ఎక్కడున్నాడు?" అడిగేడు.

"ఆయన గదిలోనే వుండివుంటారు. వెళ్ళి కలుసుకోండి. నేను కాస్త స్నానం అదీ జేసి మళ్ళీ కలుస్తాను." అని ప్రిన్స్ ఏ అంతస్తులో ఏ గదిలో వున్నాడో చెప్పి, తాము వేసిన ఎత్తు అలా ఫలించినందుకు లోలోన నవ్వుకుంటూ బైటికి నడిచింది షీల.

ప్రొఫెసర్ గబగబ గది లాక్ జేసి, లిఫ్ట్‌లో ఆరవ అంతస్తు జేరుకున్నాడు. ఆ అంతస్తులో వున్న గదులన్నీ కేవలం ప్రముఖుల కోసమే ఏర్పాటు జెయ్యబడ్డాయి.

రూం నెంబర్స్ చెక్ జేస్తూ ప్రిన్స్ గదిముందు ఆగేడు. తలుపు మూసివుంది. తలుపు పక్కనే వున్న కాలింగ్ బెల్ నొక్కేడు. రెండు నిమిషాల తరువాత, ప్రిన్స్ సెక్రెటరీ ఖుద్రతుల్లా సూడానీ (పృథ్వీరాజ్) తలుపు తీసేడు.

"అయామ్ ప్రొఫెసర్ అగర్వాల్! ప్రిన్స్ ఖాసిమ్ గారు నన్ను చూడాలనుకుంటున్నారని తెలిసి......" ఇంకా ప్రొఫెసర్ మాట పూర్తి కాకముందే—

"ఓ, ఎస్. ఎస్ ప్రొఫెసర్! వెల్ కమ్, వెల్ కమ్!" అన్నాడు పృథ్వీరాజ్ తలుపుకడ్డం తొలుగుతూ.

ప్రొఫెసర్ లోనికి అడుగు పెట్టగానే గది మధ్య సోఫాలో కూర్చున్న ప్రిన్స్ ఖాసిమ్ నవ్వుతూ– "రండి ప్రొఫెసర్! మీకోసమే ఎదురు చూస్తున్నాను" అన్నాడు.

"థాంక్యూ, యువర్ ఎక్సిలెన్సీ!" అంటూ వెళ్ళి అతని ముందు ఒదిగి కూర్చున్నాడు ప్రొఫెసర్.

"బహుశా, మిస్ లోరెన్స్ మీకన్ని విషయాలూ చెప్పి వుంటుంది!" అన్నాడు ప్రిన్స్ హుక్కా పీలుస్తూ.

"ఎస్, యువర్ ఎక్సలెన్సీ! నాకు చాలా ఆశ్చర్యం వేసింది. నేను ప్రాణసంకటంలో వున్న విషయం మీ కెలా తెలిసిందా అని?"

ప్రిన్స్ నవ్వి– "మాకూ అరితేరిన ఒక ఇంటెలిజెన్స్ సంస్థ వుందని మరవకండి ప్రొఫెసర్! ప్రపంచంలో ఏ మూల ఏంజరుగుతుందో మాకు చిటికెలో తెలిసిపోతుంది."

"మీరూ, ప్రొఫెసర్ బీరేంద్రనాథ్ ముఖర్జీ ఒకప్పుడు భారతదేశంలో పనిచేసేవారని నాకు తెలుసు. అంతేకాదు, ఏ కారణాలవల్లో మీకు మీ దేశం నచ్చక, అక్కణ్ణించి పారిపోయేరు. ప్రస్తుతం మీరిద్దరూ ఇక్కడ ఎఫ్ సైన్ అనే గ్యాస్ తయారుజేస్తున్నారనీ నాకు తెలుసు.

మీరీదేశంలో సజీవంగా వున్నట్టు భారతదేశం పసిగట్టింది. దేశద్రోహ నేరంకింద మీ ఇద్దర్నీ బంధించి తీసుకురమ్మని కొమ్ములు తిరిగిన తన ఏజంట్లని పంపింది. ఒకవేళ సజీవంగా తీసుకురావడం సాధ్యపడక పోతే, ఇక్కడే చంపివెయ్యమని ఆదేశించింది. ఏ క్షణంలోనైనా వారు మీ ప్రాణాలు తియ్యవచ్చు.

ఈ విపత్కర పరిస్థితి నించి నేను మిమ్మల్ని కాపాడగలను ప్రొఫెసర్! నిజానికి నేను మీతో ఒక ఒప్పందం కుదుర్చుకోడానికే ఇక్కడికి వచ్చేను" అన్నాడు తాపీగా హుక్కా పీలుస్తూ.

"ఏమిటది?" అడిగేడు ప్రొఫెసర్ కుతూహలంగా.

ప్రిన్స్ నోట్లోంచి హుక్కా తీసి– "మీరు తయారు జేస్తున్న ఆ గ్యాస్ మాకు కావాలి. మా అరబ్బు దేశాలు ఎప్పుడూ యుద్ధజ్వాలాల్లో మునిగి తేలుతుంటాయని మీకు తెలిసిందే కదా?

ఇరవై కి పైనవున్న, ఆసియాలోకెల్లా అతిసంపన్నమైన మా అరబ్బుదేశాలు, జానెడు ఇంగ్రాయిల్ చేతిలో రెండుసార్లు చిత్తుగా ఓడిపోయిన విషయమూ మీకు తెలిసిందే కదా?

అన్ని దేశాలూ కలిసి కట్టుగా యుద్ధంలో పాల్గొన్నా పిడికెడు ఇజ్రాయిల్ ని లొంగదియ్యలేకపోయాం. ఎంత నామోషీ! ఎంత సిగ్గుచేటూ!

అప్పుడే మీ గ్యాస్ విషయం మాకు తెలిసింది. దాన్ని మా చేజిక్కించుకుని, ఇజ్రాయిల్ సైన్యాల మీదికి వదిలి, మాకు జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకోవాలని నిశ్చయించేము. ఈ ఒప్పంద వల్ల మీకూ మాకూ అన్నివిధాలా లాభం చేకూరుతుంది.

కొలంబోలో చెడిపోయిన నా జెట్ విమానం ఇప్పుడు ఇక్కడి ఏర్ పోర్ట్ లో వచ్చి రెడీగా ఉంది. మిమ్మల్ని ఆ భారత గూఢచారుల బారినించి తప్పించి, సురక్షితంగా మా దేశానికి తీసికెళ్తాం.

అంతేకాదు, మీ ఇద్దరి పేర ఐదు లక్షల డాలర్ల చొప్పున స్విడ్జర్లాండ్ బ్యాంకుల్లో జమచేస్తాం. మా దేశంలో మీరు సుఖంగా బ్రతకడానికి అవసరమైన అన్ని సౌకర్యాలూ కలిగిస్తాం.

భారత గూఢచారులు మీకోసం మా దేశంలో ప్రవేశించే ప్రసక్తే లేదు. ఒకవేళ తెగించి ప్రవేశించినా, అరబ్బు దేశాలన్నిటికీ చెప్పి భారతదేశానికి పెట్రోల్ సరఫరా నిలిపివేస్తాం. దాంతో, ఇండియా మీ విషయంలో కిక్కురుమనకుండా ఊరుకుంటుంది. ఏమంటారు?" అడిగేడు.

"మా కోసం ఇంత మంచి ఆలోచన జేసిన మీకు ఏ విధంగా కృతజ్ఞతలు తెలుపుకోవాలో అర్థంకావడంలేదు? కాని, ఇక్కడి ప్రభుత్వంతోనూ మాకో ఒప్పందం వుందే!" అన్నాడు ప్రొఫెసర్ సందేహిస్తూ.

పకపక నవ్వేడు ప్రిన్స్- "వేలెడంత ఈ కర్ కాయీ ప్రభుత్వం మీకేం ఇవ్వగలదు ప్రొఫెసర్? ఈ ద్వీపం మా కంట్రీ చుట్టుపక్క లెక్కడైనా వుంటే ఈపాటికి దీన్ని కొనేసేవాళ్ళం!

మా దేశంలో మీకు వసతీ, నౌఖర్లూ కాక, రోజుకో అందమైన అమ్మాయి ఏ దేశంనించి తెప్పించమన్నా తెప్పించి ఇవ్వగలం. ఆ ఐదులక్షలే గాక, మీ ఇద్దరికీ సాలీనా ఏభైవేల డాలర్లు జీతంగా ఇవ్వబడతాయి. అంతే కాదు, మిస్ లోరెన్స్‌ని కూడా కొనగలను!"

మిస్ లోరెన్స్, రోజుకో అందమైన విదేశీ యువతి, సాలీనా ఏభైవేలూ, బ్యాంకులో ఐదు లక్షలూ వినగానే ప్రొఫెసర్ కళ్ళు తళతళ మెరవసాగేయి.

"ఆల్ రైట్ యువర్ ఎక్సెలెన్సీ! మీ ఒప్పందాన్ని స్వీకరిస్తున్నాను. ఇప్పుడే వెళ్ళి ప్రొఫెసర్ ముఖర్జీని రాజీకి ఒప్పిస్తాను." అన్నాడు ఆనందంగా.

"వెరీగుడ్ ప్రొఫెసర్! మీ నిర్ణయం అభినందించ తగ్గది. ఇంతకీ ఇక్కడి లేబొరేటరీలో ఆ గ్యాస్ ఎంత వరకు తయారైంది?" అడిగేడు ప్రిన్స్ కుతూహలంగా.

"సగం పని ముగిసింది. మరికొద్ది రోజుల్లో కావాలని నంత ప్రమాణంలో గ్యాస్ తయారుజేసుకునే స్థితికి వస్తాం."

"ఐతే ఈ విషయంలో నాదొక షరతుంది!"

"ఏమిటిది?"

"ఎట్టి పరిస్థితిలోనూ ఆ గ్యాస్‌గానీ, దాని ఫార్ములా గానీ ఈ దేశంలో వుండకూడదు. ఇక్కడి లేబొరేటరీలో ఆ గ్యాస్ గనక తయారౌతుంటే, మా శత్రుదేశం కూడా దాన్ని కొని మా మీద ఉపయోగించవచ్చు. అప్పుడు మేమింత ఖర్చుపెట్టడం దండగే కదా?" అన్నాడు ప్రిన్స్.

"ఐతే ఏం జెయ్యమంటారు?"

"ఆ గ్యాస్‌తోబాటు ఆ లేబొరేటరీని ఇక్కడే ధ్వంసంజేసి ఫార్ములాని మీతోబాటు మా దేశానికి తీసుకురండి. ఏమంటారు?"

"మీ ఆలోచన సమంజసంగానే వుంది. కాని, లేబొరేటరీని ఎలా ధ్వంసం జెయ్యగలం? దానిచుట్టూ అంత పెద్ద సెక్యూరిటీ ఫోర్స్ కాపలా వుంటుంది కదా? అది సాధ్యమేనా?"

ప్రిన్స్ నవ్వి - "తలుచుకుంటే, సాధ్యంకానిది ఏముంది ప్రొఫెసర్? సైంటిస్టులైన మీరే ఇలా అంటే ఎలా? చాలా సింపుల్ మేటర్! మీకు కొన్ని టైం బాంబులిస్తాం. లేబొరేటరీలోకి వెళ్ళడానికి మిమ్మల్ని అడ్డగించే వాళ్ళెవ్వరూ లేరు. బాంబులు జేబులో వేసుకుని లేబొరేటరీకి వెళ్ళండి. ముందు ప్రొఫెసర్ ముఖర్జీకి అన్ని విషయాలూ విపులంగా చెప్పి ఆయన్ని ఒప్పించండి. తరవాత ఇద్దరూ కలిసి ఆ బాంబులు లేబొరేటరీలోని ముఖ్యమైన ప్రదేశాల్లో పెట్టి టైం ఫిక్స్ జెయ్యండి.

ఆ పని అయ్యేక, ప్రెసిడెంట్ ఫెర్నాండెజ్‌ని కలుసుకోడానికి వెళుతున్నామని కాపలా వాళ్ళకి చెప్పి, అక్క

ణించి బైలుదేరి మూడో కంటికి తెలీకుండా ఏర్‌పోర్టు జేరుకోండి.

అక్కడ నా విమానం సిద్ధంగా వుంటుంది. అందులో నేనూ మిస్ లారెన్స్, నా సెక్రెటరీ కూర్చుని మీకోసం ఎదురు చూస్తుంటాం. ఏమంటారు?'' అన్నాడు.

ప్రొఫెసర్ వెంటనే పలకలేదు. కాసేపు తీవ్రంగా ఆలోచించి, చివరికి తలెత్తి_ ''ఆల్ రైట్ యువర్ ఎక్సెలెన్సీ!'' అన్నాడు గంభీరంగా.

ప్రిన్స్ తన సెక్రెటరీ వైపు తిరిగి_ ''ప్రొఫెసర్‌కి టైంబాంబ్స్ ఇవ్వు!'' అన్నాడు నవ్వుతూ.

10

ఏర్‌పోర్టులో_హాంగర్ బైట రన్‌వే మీద ఎగరడానికి సిద్ధంగా వుంది ప్రిన్స్ విమానం! దాని మీద కువైట్ దేశపు రాజముద్ర స్పష్టంగా కనిపిస్తోంది. కువైట్ అనుమతితో భారత ప్రభుత్వం ముందే ఆ ఏర్పాట్లు జేసింది.

అందులో_డేవిడ్, పృథ్వీరాజ్, రాజారెడ్డి, షీలా కూర్చుని ప్రొఫెసర్ల రాకకోసం ఎదురు చూస్తున్నారు. రాజారెడ్డి ఓ మూలకి ఒదిగి కూర్చున్నాడు. డేవిడ్ బైనాక్యులర్స్ ద్వారా పార్కింగ్ ప్లేస్ వైపు చూస్తున్నాడు ప్రొఫెసర్ల జీప్ ఎప్పుడు వస్తుందా అని!

సరిగ్గా ఎనిమిదిన్నరకి ఓ జీపు వచ్చి పార్కింగ్‌లో ఆగింది. అందులోంచి దిగిన ఇద్దరు వ్యక్తుల్ని చూడగానే_

''వాళ్ళు వచ్చేశారు!'' అన్నాడు డేవిడ్ ఉత్సాహంగా.

అందరి మనసులూ కుదుటబడ్డాయి.

ప్రొఫెసర్లిద్దరూ జాగ్రత్తగా అటూ ఇటూ చూసుకుంటూ గబగబ విమానం వైపు వస్తున్నారు.

వాళ్ళు విమానాన్ని సమీపించగానే- "వెల్‌కమ్ ప్రొఫెసర్స్" అన్నాడు డేవిడ్.

ఇద్దరూ మెట్లెక్కి విమానంలో అడుగు పెట్టేక, పృథ్వీరాజ్ స్టెప్స్ లోనికి లాగి తలుపులు మూసేడు. లోపల షీలని చూడగానే ప్రొఫెసర్ అగర్వాల్ కళ్ళు తళతళ మన్నాయి.

"లేబొరేటరీలో టైంబాంబ్ పెట్టేరా ప్రొఫెసర్స్?" అడిగాడు ప్రిన్స్ వేషంలో వున్న డేవిడ్.

"ఎస్ యువర్ ఎక్సెలెన్సీ! సరిగ్గా తొమ్మిది గంటలకి అవి పేలేలా టైం ఫిక్స్ చేశాం. అంతా మీరు కోరిన ప్రకారం జరిగింది. ఇదుగో, ఆ ఫార్ములా కూడా తెచ్చాం." అంటూ మడత పెట్టిన అరతావు సైజు కాగితాల కట్ట తీసి ప్రిన్స్ చేతికిచ్చేడు అగర్వాల్.

ముందే కంట్రోల్ రూంనించి ఎగరడానికి అనుమతి కోరి రెడీగా వున్నందువల్ల, ప్రొఫెసర్లు లోనికి రాగానే పైలెట్లు ఇంజన్ స్టార్ట్ చేసేరు. విమానం రన్‌వే మీద కొద్ది దూరం పరిగెత్తి గాలిలోకి ఎగిరింది.

డేవిడ్ ఫార్ములా కాగితాలు అందుకోగానే, వాటిని మూల కూర్చున్న రాజారెడ్డి కందించేడు.

"వారెవరు?" అడిగేడు అగర్వాల్ ఆశ్చర్యంగా.

"ఓ, మరిచేను. మీరీయన్ని ఇంతవరకూ చూడలేదు కదూ? ఈయన పేరు షేక్ అమానుల్లా! నా ముఖ్య సలహాదారు!" అంటూ పరిచయం జేసేడు డేవిడ్.

"గ్లాడ్ టు సీయూ ప్రొఫెసర్స్!" అంటూ వాళ్ళకి షేక్‌హాండ్ ఇచ్చేడు రాజారెడ్డి.

అందరి కళ్లూ చటుక్కున రిస్టువాచీల మీదికి మళ్లేయి. తొమ్మిదికి రెండు నిమిషాలు తక్కువ. అప్పటికే విమానం చాలా పైకి వచ్చేసింది.

అందరూ కిటికీలగుండా కింద చీకట్లోకి చూడసాగేరు. సరిగ్గా తొమ్మిది గంటలకి, లిప్తపాటు పెద్ద వెలుగు కనిపించి మరుక్షణం దిక్కులు పిక్కటిల్లే బ్రహ్మాండమైన ప్రేలుడు వినిపించింది. కింద మంటలు మిణుకు మిణుకు మంటున్నాయి.

ప్రొఫెసర్ల వైపు తిరిగి "థాంక్యూ ప్రొఫెసర్స్! మేము వేసిన ఎత్తుకు చిత్తై మీ చేజేతులా మీరు సృష్టించిన గ్యాస్‌ని ధ్వంసం చేసి, మీ అంతట మీరే వచ్చి మా వలలో పడ్డందుకు మెనీ థాంక్స్!" అన్నాడు డేవిడ్ తలమీది పాగా, అతికించుకున్న మీసాలూ తీసి వేస్తూ.

అతనితోబాటు రాజారెడ్డీ తన ఇండోనేషియన్ మేకప్ తీసి అవతల పడేసేడు. షీల కూడా నవ్వుతూ తల మీది రాగి వర్ణం విగ్గు తీసి కింద పడేసింది.

ప్రొఫెసర్లిద్దరూ దిగ్భ్రాంతితో ఇదంతా చూస్తున్నారు.

అగర్వాల్ తేరుకుని_ "ఏమిటీ నాటకం? ఎవరు మీరు?" అన్నాడు లేచి నిల్చుంటూ.

రాజారెడ్డి నవ్వి_ "భారత గూఢచారులం! ఇప్పుడు మీరిద్దరూ మా సజీవ ఖైదీలు. మాతృదేశ ద్రోహానికి మీ మీద మిలిటరీ కోర్టులో విచారణ జరుపబడుతుంది. యావజ్జీవ ఖైదు, లేదా మరణశిక్ష పడవచ్చు!" అన్నాడు.

ప్రొఫెసర్ ముఖర్జీ భయంతో గావుకేక పెట్టి ఫిట్స

వచ్చిన రోగిలా వణుకుతూ కూర్చున్న చోటే మూర్ఛ పోయేడు.

"యూ బ్రూట్స్!" అంటూ ప్రొఫెసర్ అగర్వాల్ పిచ్చి ఆవేశంతో రాజారెడ్డి మీదికి ఉరికేడు.

రాజారెడ్డి మెరుపులా పక్కకి తప్పుకుని, అరచేతి అంచుతో ప్రొఫెసర్ మెడమీద ఒక్కటి ఇచ్చేడు. అతను ఆ దెబ్బనించి తేరుకోకముందే పిడికిలి బిగించి డొక్కలో కుమ్మేడు. ప్రొఫెసర్ ఇక తట్టుకోలేక మొదలు నరికిన చెట్టులా కింద కూలేడు.

దోషుల్ని మోసుకుంటూ విమానం భారతదేశం వైపు శరవేగంతో దూసుకుపోసాగింది!

—: ఐ పో యిం ది :—